స్వాతి సపరివార పత్రిక కామెడీ కథల పోటీలో

ఉత్తమ కథగా బహుమతి పొందిన కథ

# జీరో సైజు



**త**లుపు తీసిన భార్యామణి వంక గుడ్లప్పగించి చూశాడు రాంపండు.

సుందరో, సువర్ణ సుందరో – అని క్షణకాలమే అయినా సందిగ్ధంలో ఊగాడు.

అంత కొత్తగా ఉందామె.

పల్చని తెల్లచీర ధరించింది. పొడుగాటి జడ స్థానే 'U' ఆకారంలో కటింగు చేయించుకున్న జుట్టు ఎగిరెగిరిపడుతోంది. కనుబొమ్మలు సన్నబడ్డాయి. ముఖంలోకి మెరుపు వచ్చింది. పెదాలు గులాబీల్లా విచ్చుకున్నాయి.

సమ్మోహితుడై చూశాడు.

మరుక్షణం దాసోహమైపోయాడు. అడుగులో అడుగువేస్తూ ఆమెననుసరించాడు.

వయ్యారంగా వెనుదిరిగింది. జఘనసైజు కొంచెం తగ్గినట్టుగా అన్పించి మురిసిపోయాడు.

ఫ్లాస్కులోని టీ పోసిచ్చింది.

"ఇది కలా గ్రాఫిక్‌వర్కా?" అన్నట్టు చూశాడామెను.

ఆ చూపుల భావం అర్థమై కిలకిలా నవ్వేసింది.

మైమరచిపోయాడు.

పెళ్ళైన కొత్తలోని సుమధుర స్మృతులు మదిలో కదిలి మెదిలి గిలిగింతలు పెట్టాయి.

గులాబీల సుగంధం తన చుట్టూ ఆవరించినట్టు అనుభూతి పొందాడు. "సుందరీ, నువ్వు నువ్వేనా?"

"ఎలా ఉన్నాను?" సత్యభామ స్టైల్లో నిలబడి మరీ అడిగింది. జడ ఉండి వుంటే మరింత రాజసమూ రసికత్వమూ ఒలకబోసేదేమో!

"చాలా చాలా బాగున్నావు. ఏమిటి విశేషం?"

"మధ్యాహ్నం మన పక్కింట్లోకి కొత్తగా అద్దెకు దిగినావిడ వచ్చింది..."

"ఓహెూ లేడీస్ ఎఫెక్టా!" రామన్స్ ఎఫెక్టా అన్నట్టుగా అన్నాడు.

చురుగ్గా చూసింది.

వెర్రిగా నవ్వాడు.

"మన పెళ్లి ఆల్బం చూపించాను. నా ఫొటోలు చూసి నా ముందు సినీతారలు దిగదుడుపు అంది. అందం దేవుడిచ్చిన అపురూప వరం అని చెప్పింది. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఉద్బోధించింది. సన్నగా నాజూగ్గా ఇలియానాలానో, జెనీలియాలానో ఉంటే, మగాళ్ళు మన చుట్టూ ప్రదక్షిణ చేస్తారని చెప్పింది. కొంచెం శ్రద్ధ వహిస్తే నేను కరీనా కపూర్ అయిపోతానంది..."

'నీ పక్కన మీ ఆయన దిష్టిపిడతలా ఉన్నాడు' లాటి కామెంట్లు విసరనందుకు సంబరంగా నిట్టూర్చాడు.

"ఒక ఆడది మరో ఆడదాన్ని మెచ్చుకోవడం ఎనిమిదో వింతే!'

"ఉన్నమాట చెప్పింది. అందులో వింతేముంది? ఆవిడ సలహా మీదట బ్యూటీ పార్లర్ కెళ్ళాను. జుట్టెలా ఉంది? ముఖానికి ఫేషియల్స్ చేయించాను. ఇక నుంచి కాటన్ చీరలు మానేసి పల్చని చీరలు ధరించమంది. సన్నగా కన్పిస్తానని....!"

"అదీ పాయింటేగాని మరీ లోదుస్తులు కన్పించే లాటివైతే..." అంటూ ఇబ్బందిగా మొహం పెట్టాడు..

అదేం పట్టించుకోకుండా, "బ్యూటీ పార్లర్ ఆవిడేమందో మీకు తెలుసా?" అంది.

'తెలీదు' అన్నట్టు తలను అడ్డంగా ఊపాడు.

మీకు నా మీద ప్రేమ లేదంది.

పిడుగు మీద పడ్డట్టు అదిరిపడ్డాడు.

"ఆవిడేదో అసూయతోనో అక్కసుతోనో అని ఉంటుంది. అదేం పట్టించుకోకు డార్లింగ్. నువ్వంటే నాకు పీకల్దాకా ప్రేముంది తెల్సా?"

"మరైతే నేను లావుగా అయిపోతోంటే ఎందుకు పట్టించుకోలేదు?" అని ఆమె సూటిగా ప్రశ్నించేసరికి సమాధానం తోచక తికమకపడ్డాడు.

"అదీ... అసలేంటంటే సుందరీ-పెళ్ళయ్యాక ఆడవాళ్ళు కొంచెం ఒళ్ళు చేస్తారు. బొద్దుగా ముద్దుగా నిండుగా నిండుకుండలా వికసించిన స్త్రీత్వంతో ఆహా అన్పించేలా మారతారు. అసలు బొద్దు వేరు, లావు వేరు..."

"ఏం కాదు. ఆడవాళ్ళు కందపిలకల్లా అడ్డదిడ్డంగా పెరుగుతారు. మగాళ్ళు ఆ సంగతి గ్రహించకుండా, విరుగుడు ఆలోచించకుండా మా ఆవిడ లావు అయిపోయిందని నిట్టూరుస్తారు. ఇలియానాలాంటి వాళ్ళని చూసి లొట్టలేస్తారు" అక్కసుగా అంది సుందరి.

"అంతా అలా ఉండరు సుందరీ. కొన్ని ఎక్సెప్షన్లుంటాయి. నేనేంటో నీకు తెలీదూ. నీకెన్ని చీరలు కొన్నాను. ఎన్ని నగలు చేయించాను. ఎన్ని..."

"చాల్లెండి సంబడం. అవన్నీ పదిమందిలో మీ గొప్పచాటుకోడానికి చేశారు గాని నా గురించి కానే కాదు" ఖండితంగా తేల్చేసింది.

"అయ్యో! నిన్ను ఎలా కన్విన్స్ చెయ్యాలో తెలీట్లేదు" అంటూ జుట్టు పీక్కోబోయి, అది బలంగా ఉండటంతో ఆ ప్రయత్నం విరమించాడు రాంపండు.

"మీ ప్రేమని ఋజువు చేసుకునే మార్గం ఉంది..."

భార్యామణి మాటలకు సందేహిస్తూనే భయపడ్తూనే ఏవిటన్నట్టు చూశాడు.

"ఆముదం తాగిన ముఖం పెట్టారు. మీకు నేనంటే ప్రేమ లేదు. లవ్ లేదు. ఇష్క్ లేదు. మావాళ్ళు నన్ను మీకు కట్టబెట్టి మొండి కత్తితో నా గొంతు కోసేశారు" అంటూ ముక్కు చీదింది.

"ఇంతోటి దానికి మరీ అంతంత పెద్ద పెద్ద సమాసాలు, సంధులూ, చీదుళ్ళూ ఎందుకే. ఇదిగో ఇప్పుడే పంచభూతాల సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా ప్రేమ సత్యము నిత్యము అని చాటడానికి సిద్ధంగా ఉన్నాను డియర్. నిప్పుల మీద నుంచి దూకనా, నీళ్ళలో ఈదనా, కొండ ఎక్కనా, కొండ మీంచి జారనా... ఏం చెయ్యను? కమాన్ చెప్పు మైడియర్ సుందరీ" చిటికేస్తూ అన్నాడు.

బోలెడు సంబరపడిపోయిందామె.

"మీరు చాలా గొప్పవారని నాకు తెలీదూ. మిమ్మల్ని అలాంటి కఠిన పరీక్షలకు గురిచేస్తానా చెప్పండి. మీరు నా ప్రత్యక్ష దైవం" మంగళసూత్రం బయటికి తీసి కళ్ళకద్దుకుంది.

"ఈ సస్పెన్స్ భరించలేకపోతున్నాను. ఏం చెయ్యమంటావో వెంటనే చెప్పేసెయ్" లేచి పరుగెత్తడానికి సిద్ధమైనవాడిలా పొజిషన్ తీసుకుంటూ అన్నాడు.

"స్లిమ్ అండ్ స్లిమ్‌కి తీసుకెళ్ళండి చాలు" ఆమె చిర్నవ్వులు చిందిస్తూనే చెప్పింది.

కాని రాంపడుకి చిన్నగా స్ట్రోక్ వచ్చింది.

గుండె పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు.

"మీ గుండె లబ్‌డబ్ అనిగాక సుందరి అందం అని కొట్టుకుంటోంది కదూ?"

పిచ్చిగా చూస్తూ వెర్రిగా నవ్వాడు.

"అపాయింట్‌మెంట్ కోసం ఫోన్ చేస్తాను..."

అతడికి ముచ్చెమటలు కారిపోతున్నాయి. అయినా తలాడించాడు.

ఆమె ఆ పనిలో పడింది.

అతడు ఆలోచనలో పడ్డాడు.

'స్లిమ్ అండ్ స్లిమ్' గురించి తెలీనివాళ్ళుండరు.

టీవీలో, పేపర్లలో, హోర్డింగుల్లో ఊదరగొడుతూంటారు. సన్నజాజి తీగలాగా చేసే మంత్రం మా సొంతం-అన్నది వారి స్లోగన్. అందం లేనివాళ్ళు మనుషులే కాదంటాయ్ వారి ప్రకటనలు.

సినిమా టీవీతారలూ, ఉన్నతవర్గాల వారూ ఎక్కువగా వెళ్తూంటారు. వారి ఫీజులూ ఆ రేంజిలోనే ఉంటాయిట.

"పది నిమిషాల నుంచీ ఎంగేజ్డ్! అంటే వాళ్ళకెన్ని ఫోన్లొస్తున్నాయో చూడండి"

'అవునుగాని... నువ్వు నువ్వనుకున్నంత లావెక్కలేదు సుందరీ. మామూలు బ్యూటి పార్లర్‌కో, జిమ్‌కో వెళ్తే సరి పోదంటావా? ఇంట్లో యోగా చేసినా బెటరే..."

ఆమె ఉరిమి చూసింది ఉత్తరక్షణాన కన్నీళ్ళు ఉబికివచ్చాయి.

"మీకు నా మీద ప్రేమ ఉందనుకోవడం నాదే బుద్ధి తక్కువ" ఉక్రోషంగా అనేసి

గదిలోకెళ్ళి ముసుగు తన్నేసింది.

'హారి దేవుడా!' అనుకున్నాడు.

పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టుగా ఫీలవుతూ కాళ్ళీడ్చుకుంటూ గదిలోకెళ్ళాడు. బ్రతిమాలాడు. బామాలాడు.

కాళ్ళు పట్టుకున్నాడు. గెడ్డం పట్టుకోబోయాడు.

విదిలించేసింది. పట్టువదలని విక్రమార్కుడయ్యాడు. కడకి జరిమానాగా పట్టుచీర సమర్పించుకుంటానని ప్రామిస్ చేశాక ప్రసన్నురాలయ్యింది.

'అయిదు వేలు కృష్ణార్పణం!' అనుకున్నాడు దిగులుగా.

"అపాయింట్‌మెంట్ దొరికింది. ఈ సాయంత్రం ఆరుగంటలకే రమ్మన్నారు" లాటరీ తగిలినంత ఆనందంగా చెప్పింది.

"బ్యాంకుకెళ్ళి డబ్బు తేవద్దూ..."

"ఏటిఎమ్ కార్డు ఉందిగా!"

మారు మాట్లాడ లేకపోయాడు.

సుందరి గబుక్కునొచ్చి మొగుడి పెదాల మీద గాఢంగా ఇంగ్లీషు ముద్దు పెట్టుకుంది. ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఆ తర్వాత ఇద్దరూ ఆనందపు తేరుమీద ఊరేగారు.

కాని ఇద్దరి కారణాలు వేరు వేరు.

ఆరుగంటలకి ఓ పది నిమిషాలు ముందే 'స్లిమ్ అండ్ స్లిమ్' కెళ్ళారు.

ఓ మెరుపుతీగ వంగి నమస్కరించి ఆహ్వానించింది.

ఖరీదైన సోఫాలు, పూలకుండీలు, ఏసీ, గోడలకి సన్నని ఆడ, మగవారి ఫోటోలు, షాండ్లియర్... చాలా పోష్‌గా స్టార్ హొటల్లోలా ఉంది.

ఇంకొకరొచ్చి చిన్న క్యాబిన్లోకి తీసుకెళ్ళారు. చల్లని కూల్డ్రింక్ తెచ్చిచ్చారొకరు. ఒక ఫారం తెచ్చి రాంపండుకిచ్చారు.

"ట్రీట్‌మెంట్ నాక్కాదు మా ఆవిడకి"

"తెలుస్సార్. మీ మిస్సెస్ అందచందాల కోసం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్న మిమ్మల్ని బెస్ట్ హజ్బెండ్‌గా గుర్తించి సత్కరించడం మా బాధ్యత"

పొంగిపోయాడు. మొహమాటపడ్డాడు. సిగ్గుపడ్డాడు.

ఫారం పూర్తి చేశాక మరో పెద్ద చల్లని రూములోకి తీసుకెళ్ళారు.

సంస్థ ఎమ్‌డీ మిస్సెస్ కీర్తిరావు తన భారీ శరీరం సహకరించకపోయినా కూర్చీలోంచి ఎలాగో లేచి నిలబడి షేక్ హేండిచ్చింది. పిమ్మట అతడి మెడలో సిల్వర్ మెడల్ వేసింది. బొకే ఇచ్చింది. కెమెరా క్లిక్‌మంది.

పరమానందపడిపోయి పదేపదే కృతజ్ఞతలు చెప్పాడు.

రూమ్‌లోంచొస్తూ "వీళ్ళు చాలా గ్రేట్ పీపుల్. నువ్విక్కడే ట్రీట్‌మెంట్ తీసుకుందువుగాని" అన్నాడు రాంపండు.

సుందరి అతడి చేతిని తన చేత్తో పెనవేసి అల్లరిగా నవ్వింది.

తను స్లిమ్ అయితే వాళ్ళు వెండి కిరీటం పెడతారు కాబోలనుకుంటూ బ్యూటీక్వీన్‌కి కిరీటం పెట్టే దృశ్యాన్ని తలచుకుంది.

వాళ్ళలానే తనూ నోటిని రెండు అరచేతుల్తో మూసుకుని అమితాశ్చర్యబోయి, ఆ తర్వాత 'వావ్' అని అరిచి ముద్దుల్ని గాలిలోకి విసుర్తున్నట్టుగా ఊహించుకుంది సుందరి.

కాళ్ళు నేలమీద ఆనడం మానేశాయి. మరో క్యాబిన్‌లో కెళ్ళారు. అక్కడ సుందరి వివరాలు తీసుకున్నారు. హైటూ వెయిటూ చూశారు. శరీరాంగాల కొలతలు తీసుకున్నారు. బాడీలోని ఎముకల బరువు, కండ బరువు లెక్క గట్టారు. ఏయే భాగాల్లో కొవ్వు పేరుకుందీ గుర్తించారు.

బ్యూటీషియనూ, డైటీషియనూ డిస్కస్ చేసుకుని చివరికి ఒక అభిప్రాయానికొచ్చారు.

"మొత్తానికి పది కిలోల బరువు తగ్గాలి. పదిరోజుల్లో తగ్గుతారా ఇరవై రోజుల్లో తగ్గుతారా?"

"పది రోజుల్లోనే" ఠకీ మని చెప్పింది.

వారో ప్లాన్ రూపొందించి కంప్యూటర్ ప్రింటు తీసిచ్చారు.

దాని ప్రకారం రోజూ రెండు గంటల పాటు స్లిమ్ ట్రీట్‌మెంట్‌కి రావాలి. వాళ్ళు చెప్పినదే, చెప్పిన పరిమాణంలోనే ఆహారం తీసుకోవాలి. రోజుకో గంటసేపు ట్రెడ్‌మిల్ గాని సైక్లింగ్ గాని చెయ్యాలి.

మరో గంటసేపు యోగాసనాలు వెయ్యాలి.

వీటన్నిటికీ మించి కరీనాకపూర్ నిలువెత్తు సైజు ఫోటోని ఇంట్లో గోడకి తగిలించుకుని కనీసం రోజుకి రెండు గంటల సేపైనా రెప్ప వేయకుండా చూడాలి.

అప్పుడు 'సన్నబడ్డాను సన్నబడ్డాను' అంటూ మంత్రంలా పఠించాలి.

దాంతో ఫలితం అత్యద్భుతంగా ఉంటుందనీ, జీరో సైజు బ్యూటీల గ్రూపులో చేరిపోతుందని నమ్మకంగా చెప్పారు.

కరీనా రంగుల ఫోటోని మడిచి రిబ్బను కట్టి మరీ ఇచ్చారు.

సుందరి ఆనందానికి అవధులు చెరిగిపోయాయి.

బిల్లు చెల్లించడానికి సదరు కౌంటరు దగ్గరికెళ్ళాడు రాంపండు.

33,999 రూపాయిలకి కంప్యూటరైజ్డ్ బిల్లు చేతిలో పెట్టారు.

పాతికవేలు క్యాష్ ఇచ్చి, మిగతాది క్రెడిట్‌కార్డ్ ద్వారా పే చేసి నిట్టూర్చాడు. ముఖానికి ఆనందం అంటించుకుని భార్య వద్ద కొచ్చాడు.

బిల్లు ఎంతయ్యిందని ఆమె అడగలేదు. అతడు చెప్పలేదు.

ఏనుగెక్కినంత సంబరపడుతూ దారి పొడవుగా ఎన్నెన్నెన్నెన్నో కబుర్లు చెప్పింది. భర్తని ఇంద్రుడూ చంద్రుడూ అని పొగిడేసింది కూడా.

ఇంట్లో కెళ్తూనే ముందు గది లోని తిరుపతి క్యాలండర్ తీసేసి కరీనా క్యాలండర్ తగిలించి దణ్ణం పెట్టుకుంది.

"మరీ అంత ఇదొద్దు. నిజం చెప్పాలంటే ఆమెకన్నా నువ్వే బావుంటావు సుందరీ. నీ ముఖాకృతి కోలగా పుష్టిగా ఆకర్షణీయంగా ఉంటుంది."

"చూశారా చూశారా. నేనంటే మీకు ప్రేమ పెరిగింది గనుకే ఇప్పుడు నా అందాన్ని గుర్తించారు. చూస్తూండండి. పది కాదు ఏడు రోజుల్లో కరీనాని మించిపోతాను"

"ఇంకెవరూ అందగత్తెల్లేనట్టు ఈ కరీనా జపమేంటే. నన్నడిగితే కరీనా కన్నా కత్రినా కైపెక్కిస్తుంది తెలుసా?"

"మీది ఓల్డ్ టేస్ట్. ఇప్పుడు జీరోసైజ్‌దే హవా. కరీనాకపూర్ జీరోసైజ్ సౌందర్య దేవత. నేనూ అలాగే జీరోసైజు అవ్వాలని నా తాపత్రయం. ఎలాగైనా అయిపోతాన్లెండి..."

'అవన్నీ మోడల్స్‌కీ, తారలకీ చెల్లుతాయిగాని గృహిణివి నీకెందుకే' అనబోయే మింగేశాడు.

ఇంకో తుఫానుని తట్టుకోగల శక్తి అతడి పర్సుకి లేదు మరి.

ట్రెడ్‌మిల్, యోగా సీడీకొని తెచ్చిచ్చాడు. రోజూ స్లిమ్ అండ్ స్లిమ్‌కి వెళ్ళి రావడానికి ఆటో ఏర్పాటు చేశాడు. ఆహార నియమాలు పాటించడానికి కావలసినవన్నీ కొన్నాడు.

స్లిమ్ వ్రతం మొదలు పెట్టింది సుందరి.

కప్పుడు అన్నం, రకరకాల రసాలు, టాబ్లెట్లు, ట్రెడ్‌మిల్, యోగా, స్లిమ్ అండ్ స్లిమ్‌లో ట్రీట్‌మెంటు, కరీనా దర్శనా దీక్ష... క్షణం తీరికుండటం లేదు.

వారం రోజులకే జీరో సైజుకి చేరుకోవాలన్న ఆత్రంతో ఆహారాన్ని మరింత తగ్గించేసింది. ఆరో రోజుకే నీరసపడి కళ్ళు తేలేసింది. ఆసుపత్రికి తీసుకెళ్ళగా వెంటనే ఐసియులో పెట్టేశారు.

బీపీ దారుణంగా పడిపోయిందిట. నార్మల్‌కి రావడానికి ఐదురోజులూ ఇరవై నాలుగు వేలూ ఖర్చయ్యాయి.

బలంపెరగటానికి టానిక్కులు, పండ్ల రసాలు, స్ట్రాంగ్ డైటూ ప్రెస్క్రైబ్ చేశారు డాక్టర్లు.

ఆసుపత్రి నుంచి డిశ్చార్జై ఇంటి కొచ్చారు.

స్లిమ్ అండ్ స్లిమ్మా? హాస్పటలా?

ఏది ఫాలో అవ్వాలి?

తేల్చుకోలేకుండా ఉంది సుందరి.

ఏమంటే ఏమంటుందోనని నోర్మూసేసుకున్నాడు రాంపండు .

ఎక్కౌంట్లో డబ్బు జీరోకి వచ్చెయ్యడంతో అప్పు చేసిన రాంపండు జబ్బుచేసిన వాడిలా అయిపోయాడు. అప్పుడప్పుడూ ఉలిక్కిపడుతూ 'అందమే మాయ' అని తనలో తను 'మ్యూట్'లో పాడుకుంటున్నాడు.

పరామర్శించడానికి పక్కిండావిడ వచ్చింది.

బెదురుచూపులు చూశాడు రాంపండు.

"జీరో సైజు మీకెందుకండీ. పెన్సిల్లా పైనుంచి కింది దాకా సమానంగా ఉంటే ఏం బావుంటుందీ! ఎత్తులూ పల్లాలూ ఉంటేనే అందం ఆకర్షణా. చక్కని అవయవసౌష్టవంతో జాంపండులానో బంగినపల్లి మామిడిపండు లానో ఉండాలి. అలాటి వారి కోసం మగాళ్ళు ప్రాణాలిస్తారు తెలుసా? చీకేసిన మామిడిటెంక లాంటి బక్క పలచ సైజు మీకొద్దుగాని ఇప్పుడు ఉన్నట్టుగానే మెయిన్ టెయిన్ చెయ్యండి చాలు అందాలరాణిగా నిలిచిపోతారు"

ఆవిడ మాటలు సుందరి మీద బాగా పనిచేశాయి. ఆవిడటు వెళ్ళగానే కరీనా క్యాలండర్‌ని సన్నని ముక్కలుగా చింపేసింది.

అపనమ్మకంగా చూశాడు రాంపండు.

"చెప్పుడు మాటలు విన్నాను. నేనో పెద్ద జీరోని!"

నవ్వింది.

ఆ నవ్వుకి ఫ్లాట్ అయిపోయి అమాంతం కౌగిలించుకున్నాడు రాంపండు.

* * *

**(స్వాతి సపరివార పత్రిక 2-4-2010)**